సాక్షి
శ్రీకాకుళం

బుధవారం । 26 । ఫిబ్రవరి । 2025



మొక్కలంటే లెక్కలేదు

సుడా కార్యాలయం వద్ద 30వేల మొక్కలు ఎండిపోతున్నాయి. రూ.30 లక్షలతో కొనుగోలు చేశారు.

- 8లో



గంజాయి రవాణా గుట్టురట్టు

గంజాయి రవాణా గుట్టును పోలీసులు రట్టు చేశారు. పలు చోట్ల గంజాయిని పట్టుకున్నారు.

- 8లో



ఆకట్టుకుంటున్న శివలింగాకృతులు

కాశీబుగ్గ: శివరాత్రిని పురస్కరించుకుని పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీకి చెందిన కొత్తపల్లి రమేష్‌ఆచారి పెన్సిల్ మొనపై శివలింగాన్ని, బంగారంతో సూదిమొనపై నిలబడేలా లింగాన్ని తయారు చేశారు. ఈ రెండు ఆకృతులు తయారు చేయడానికి సుమారు రెండు గంటల సమయం పట్టినట్లు తెలిపారు.

న్యూస్‌రీల్

రాష్ట్రస్థాయి ఫెన్సింగ్ పోటీలకు ముగ్గురు ఎంపిక



ఎంపికైన క్రీడాకారులతో కోచ్‌లు

శ్రీకాకుళం న్యూకాలనీ: రాష్ట్రస్థాయి ఫెన్సింగ్ పోటీలకు ముగ్గురు క్రీడాకారులు ఎంపికయ్యారు. శ్రీకాకుళం నగరంలోని టౌన్ హాల్ వేదికగా మంగళవారం నిర్వహించిన జిల్లా స్థాయి సబ్ జూనియర్స్ బాలబాలికల ఫెన్సింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో ప్రతిభ కనబరచిన క్రీడాకారులను రాష్ట్ర పోటీలకు ఎంపిక చేసినట్లు జిల్లా ఫెన్సింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు బలభద్రుని రాజా తెలిపారు. అండర్-14 విభాగానికి సంబంధించి ఇప్పీ కేటగిరిలో శాలిహుండం విశ్వాస్, ఫోయిల్ కేటగిరిలో గొండు అభిరామ్, బరాటం వేన్షిత ఎంపికయ్యారు. వీరంతా మార్చి 1, 2 తేదీల్లో కృష్ణా జిల్లాలో జరగనున్న రాష్ట్రస్థాయి ఫెన్సింగ్ పోటీల్లో పాల్గొననున్నారు. కార్యక్రమంలో ఎన్ఐఎస్ కోచ్ జోగిపాటి వంశీ, కోచ్ రాహుల్ పాల్గొన్నారు.

'అనూషది ఆత్మహత్య కాదు'



మాట్లాడుతున్న మృతురాలి తండ్రి కర్రి తాతారావు

కాశీబుగ్గ: మందస మండలం లోహరిబంద ఉన్నత పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్న కర్రి అనూష ఆత్మహత్యలో మరో మలుపు చోటుచేసుకుంది. విదేశాల నుంచి వచ్చిన అనూష తండ్రి కర్రి తాతారావు తన ఇంటి వద్ద మంగళవారం విలేకర్లతో మాట్లాడారు. అనూష ఆత్మహత్య విషయంలో పలు అనుమానాలు ఉన్నాయని తెలిపారు. పక్క గ్రామానికి చెందిన యువకుని కారణంగానే తన కూతురు చనిపోయినట్లు ఆరోపించారు. యువకునితో ఫోన్ సంభాషణలపై పలు అనుమానాలు వ్యక్తం చేశారు. పోలీసుల వద్ద ఈ సమాచారం ఉన్నా పోలీసులు ఎందుకు అతన్ని అదుపులోకి తీసుకోవటం లేదని ప్రశ్నించారు. ఆడపిల్లను కోల్పోయిన ఓ కుటుంబానికి జరిగిన న్యాయం ఇదేనా అని ప్రశ్నించారు. దోషులను కఠినంగా శిక్షించాలని స్థానికులు, గ్రామస్తులు డిమాండ్ చేశారు.

స్వయం సహాయక సంఘాల ఖాతాలు ఆన్‌లైన్ చేయాలి



శిక్షణలో మాట్లాడుతున్న పీడీ కిరణ్‌కుమార్

ఎచ్చెర్ల క్యాంపస్: జిల్లాలోని అన్ని స్వయం సహాయక సంఘాల ఖాతాలు ఆన్‌లైన్ చేయాలని జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ కిరణ్‌కుమార్ అన్నారు. ఎచ్చెర్లలోని జిల్లా సాంకేతిక శిక్షణ కేంద్రంలో రెండు రోజుల పాటు వెలుగు క్షేత్రస్థాయి అధికారులకు నిర్వహించిన లోకోస్ సాఫ్ట్‌వేర్ ఆన్‌లైన్ ఖాతాల నిర్వహణపై మంగళవారం శిక్షణ నిర్వహించారు. పీడీ మాట్లాడుతూ సంఘాల నిర్వహణ సక్రమంగా ఉండాలని చెప్పారు. సంఘాల నిర్వహణ సక్రమంగా ఉండాలంటే ఆన్‌లైన్‌లో పూర్తి సమాచారం ఉండాలని అన్నారు. గ్రామం యూనిట్‌గా లోకాస్ సాఫ్ట్‌వేర్‌లో సంఘాల వివరాలు అప్‌లోడ్ జరగాలని చెప్పారు.



కరకట్టలు తెంచుకున్న దోపిడీ పర్వం

ఈ ఫొటో చూడండి. జలుమూరు మండలం లింగంనాయుడుపేటలో కరకట్టను తవ్వేసి, ఇసుక అక్రమ రవాణా కోసం నదిలోకి వేసిన రోడ్డిది. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో సుమారు రూ.100కోట్లు మేర మంజూరు చేసి, వరదల నుంచి గ్రామాలను కాపాడేందుకు కరకట్టను నిర్మించగా, ఇప్పుడా కరకట్టను ఇసుక అక్రమాల కోసం తవ్వేస్తున్నారు.

- కరకట్టలపై పడ్డ ఇసుక అక్రమార్కులు
- లింగంనాయుడు పేటలో బరి తెగింపు
- టీడీపీ నాయకుడు గొండు సురేంద్ర కనుసన్నల్లో ఇసుక దోపిడీకి బాటలు
- కరకట్టలు మధ్యలో రోడ్డేసి ఇసుక రవాణా చేస్తున్న వైనం
- వరద ప్రవాహం పెరిగితే ముంపునకు గురయ్యే అవకాశం

ఈ చిత్రంలో ఉన్న వ్యక్తి పేరు గొండు సురేంద్ర. స్థానిక టీడీపీ నాయకుడిగా, కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు అనుచరుడిగా చెలామణి అవుతున్నారు. పొక్లెయినర్ పెట్టి, దగ్గరుండి కరకట్టను తవ్వించి, రోడ్డు వేయిస్తున్నారు. అక్రమ ఇసుకను తరలించేందుకు కరకట్టను ధ్వంసం చేయించారన్న ఆరోపణలు ఉన్నాయి.





ఈ చిత్రం చూడండి. లింగంనాయుడు పేట పరిధిలోని వంశధార నదిలో అక్రమంగా ఇసుకను తవ్వి, డంపింగ్ చేస్తున్న దృశ్యమిది. ఈ ఇసుకను రాత్రి పూట తరలిస్తున్నారు. ఇలా తరలిస్తుండగానే ఓ వ్యక్తి ఫిర్యాదు మేరకు సోమవారం అర్ధరాత్రి తర్వాత కొన్ని వాహనాలను పోలీసులు పట్టుకున్నారు.

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం:

లింగంనాయుడు పేట కేంద్రంగా ఇసుక దోపిడీ ఏ స్థాయిలో జరుగుతుందో చెప్పడానికి ఈ చిత్రాలే నిలువెత్తు సాక్ష్యాలు. ఎంతో సదుద్దేశంతో మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి రూ.వంద కోట్లు మంజూరు చేసి, వంశధార వరదలకు గ్రామాలు మునగకుండా కరకట్టలు నిర్మాణం చేస్తే.. నేటి పాలకపక్ష నాయకులు ఆ కరకట్టను ధ్వంసం చేసి ఇసుక కోసం బాటను వేసుకున్నారు. కరకట్టను తవ్వేసి, ఇష్టారీతిన రోడ్డు వేసి యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా సాగిస్తున్నారు. దీనికంతటికీ కర్త, కర్మ, క్రియ స్థానిక టీడీపీ నాయకుడు గొండు సురేంద్ర అన్న ఆరోపణలు ఉన్నాయి. కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు అనుచరుడిగా చెలామణి అవుతున్నారు. చెట్టు పేరు చెప్పి కాయలు అమ్ముకుంటున్నట్టుగా ఆయన పేరు వాడుకుని దందా సాగిస్తున్నారు. జిల్లాలో ఇసుక మాఫియా చెలరేగిపోతుందనడానికి ఇదొక ఉదాహరణగా చెప్పుకోవచ్చు. ప్రకృతి వనరులను కొల్లగొట్టడమే కాకుండా గ్రామాలకు హాని తలపెట్టే విధంగా వ్యవహరిస్తున్నారు.



కేసు నమోదులో తాత్సారం

స్థానికుల ఫిర్యాదుతో ఇసుక అక్రమ రవాణా చేస్తున్న ఐదు లారీలను అర్ధరాత్రి దాటాక పోలీసులు పట్టుకున్నా.. కేసు నమోదులో మాత్రం తాత్సారం జరిగింది. మంగళవారం కేసు నమోదు విషయంలో హైడ్రామా నడిచింది. ఉన్నత స్థాయి నేతల ఒత్తిళ్లో మరేంటో తెలియదు గానీ లారీలపై కేసు నమోదు చేయడానికే ఎక్కువ సమయం తీసుకున్నారు. ఇక, తవ్వకాలు జరిపిన పొక్లెయినర్‌పై కేసు నమోదు చేసే విషయంలో మాత్రం తాత్సారం చేశారు. దీన్ని తప్పించేందుకు మంగళవారం సాయంత్రం వరకు టీడీపీ నాయకులు అక్కడికి వస్తూనే, పోతూనే ఉన్నారు. దీన్నిబట్టి పోలీసులపై ఏ మేర ఒత్తిళ్లు ఉన్నాయో అర్థం చేసుకోవచ్చు. ఇందులో పెద్ద పెద్ద వ్యక్తులకు సంబంధించిన వారు ఉండటంతో డిఫెన్స్‌లో పడ్డారు.

గ్రామాలకు భవిష్యత్‌లో తప్పదు ముప్పు

వంశధార నదీ ప్రవాహం ఎక్కువగా ఉన్నప్పుడు వరదలు వచ్చి గ్రామాలు ముంపునకు గురయ్యే ప్రమాదం ఉంటుంది. దీన్ని దృష్టిలో ఉంచుకుని కరకట్టలు నిర్మించాలని మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి నిర్ణయం తీసుకున్నారు. అందులో భాగంగా రూ.100కోట్లు వరకు మంజూరు చేశారు. వాటితో నదీ తీరం పొడవునా కరకట్టలు నిర్మించారు. వీటిని నిర్మించిన తర్వాత తీర గ్రామాలు ముంపు బారి నుంచి బయటపడ్డాయి. కానీ, తాజాగా ఇసుక అక్రమ సొమ్ము కోసం ఆ కరకట్టలనే కొట్టేసి, అడ్డంగా నదిలోకి రోడ్డేసి, ఇసుక తవ్వకాలు జరిపి, తరలించేస్తున్నారు. దీనివల్ల భవిష్యత్‌లో వంశధార నది ప్రవాహం పెరిగి, వరదలు వస్తే ఆ గ్రామాలకు ముప్పు వాటిల్లే అవకాశం ఉంది.

ఉపాధి కోసమే..

నదిలోకి రోడ్డు వేసి ఇసుకను ట్రాక్టర్లతో రవాణా చేసేందుకు లారీలతో కంకర తెప్పించాను. పనిలో పనిగా ఆ కంకరు తెచ్చిన వాహనాల్లో ఇసుక లోడింగ్ చేస్తున్న సమయంలో పోలీసులు దాడిచేసి పట్టుకున్నారు. గ్రామస్తుల ఉపాధి కోసం చేశాను. అక్రమంగా డబ్బులు సంపాదించడం కోసం కాదు.

– గొండు సురేంద్ర, లింగంన్నాయుడుపేట

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు సర్వం సిద్ధం



మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లాలో ఉపాధ్యాయ శాసన మండలి ఎన్నికలకు సర్వం సిద్ధం చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీకాకుళంలో 31 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని జిల్లాలో 5,035 మంది ఓటర్లు ఉండగా వారిలో పురుషులు 3,416, మహిళలు 1,619 ఉన్నట్లు వివరించారు. వారందరికీ ఓటర్ స్లిప్పులను కూడా పంపిణీ చేశామన్నారు. పోలింగ్ కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. పోలింగ్ కేంద్రాల వద్ద వీల్ చైర్లు సమకూర్చామన్నారు. ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద ఎండ వేడిమి తగలకుండా షామియానాలు, తాగునీరు, బయో టాయిలెట్లు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఫిబ్రవరి 27 ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరగనుందని పేర్కొన్నారు. ఉత్తరాంధ్ర ఎమ్మెల్సీ (ఉపాధ్యాయ) ఎన్నికల దృష్ట్యా ఈ నెల 26, 27 తేదీల్లో ప్రత్యేక నిషేధ ఆంక్షలు ఉంటాయని తెలిపారు. అన్ని పోలింగ్, పంపిణీ, స్వీకరణ, మధ్యంతర స్ట్రాంగ్ రూమ్ కేంద్రాలలో జిల్లాలో ఈ ఉత్తర్వులు వర్తిస్తాయని తెలిపారు. చట్ట వ్యతిరేకంగా గుమిగూడటం, సభలు, ర్యాలీలు నిర్వహించడం వంటివి చేయకూడదన్నారు.

మత్స్యకారుల్లో  చిచ్చు



మాట్లాడుతున్న మత్స్యకారులు, కుటుంబ సభ్యులు (ఫైల్)

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం:

> 'ఎలక్షన్ ముందు మాయ మాటలు చెబుతారు. కానీ జగన్ గారు గెలవక ముందే మా కుటుంబాల వారికి మాటిచ్చి నిలబెట్టుకున్నారు. వైఎస్ జగన్ గెలిస్తే మా బతుకుల్లో వెలుగులు వస్తాయని అనుకున్నాం. అలాగే ఆయన గెలిచాక మమ్మల్ని పాకిస్తాన్ జైలు నుంచి విడుదల చేయించారు. ఒక్కొక్కరికీ రూ.5లక్షల సాయం అందజేశారు. 14 నెలల కష్టాలు సీఎం జగన్‌ను చూడగానే మటుమాయమయ్యాయి. మాకు ఊపిరి పోసి, పునర్జన్మ ఇచ్చారు. మా కుటుంబాల్లో ఎవరెన్ని చెప్పినా, ఏమన్నా జగన్ పార్టీకి జీవితాంతం సేవ చేస్తా. ఆయన రుణం ఈ జన్మలోనే తీర్చుకుంటా.'
>
> పాకిస్తాన్ జైలు నుంచి విడుదలయ్యాక మీడియాతో గనగళ్ల రామారావు అన్న మాటలివి..

- 'తండేల్' కథకు మూలంగా చెబుతున్న రామారావు తీరుపై తోటి మత్స్యకారుల మండిపాటు
- పాక్ జలాల్లోకి వెళ్లడానికి రామారావే కారణమని ఆరోపణలు
- రామారావు ఒకవైపు.. మిగతా 21 మత్స్యకార కుటుంబాలు మరోవైపు
- ప్రెస్‌మీట్లతో ఒకరిపై ఒకరు విమర్శలు

కానీ తండేల్ సినిమా విడుదలయ్యాక ఎందుకో రామారావు స్వరం మారిపోయింది. వైఎస్ జగన్ హయాంలో జరిగిన మేలును చెప్పుకోవడానికి చాలా ఇబ్బంది పడ్డారు. ఇతర దేశాల్లో ఉన్న వారిని విడిపించే బాధ్యతను కేంద్ర ప్రభుత్వమే చూసుకుంటుంది కదా.. ఇప్పుడు కొన్ని బుర్రలకు ఆ విషయం అర్థం కావడం లేదు.. ఏదో పట్టినట్టు కొంతమంది అదే పనిగా వైఎస్ జగన్ ప్రభుత్వం గొప్పతనమని చెబుతున్నారంటూ.. తోటి మత్స్యకారులనుద్దేశించి కొన్ని మీడియాల్లో మాట్లాడటం వివాదాస్పదంగా మారింది. అలాగే తండేల్ సినిమా యూనిట్‌తో కలిసి పలు కార్యక్రమాల్లో పాల్గొన్నా.. నాడు జరిగిన మేలు గురించి చెప్పకపోవడం కూడా మిగతా 21 మత్స్యకార కుటుంబాలకు ఆగ్రహం తెప్పించింది.

అసలు నిజమిది..

వాస్తవానికి రామారావు ఒక్కడే తండేల్ కాదని, సినిమాలో అలా కథ రాసుకున్నారు గానీ.. పాకిస్తాన్‌కు దొరికిన మూడు బోట్లలో ముగ్గురు తండేళ్లు ఉన్నారని 21 మత్స్యకార కుటుంబాల వారు తెలిపారు. తండేల్ సినిమాతో రామారావు ఒక్కరికే లబ్ధి చేకూరిందని అన్నారు. అప్పుడేం జరిగిందో తమకు తెలుసని, ఎవరి వల్ల విడుదలయ్యామో తమకు ఇంకా గుర్తుందని అన్నారు. వైఎస్ జగనే పునర్జన్మ ఇచ్చారని ఆనాడు చెప్పిన వ్యక్తి ఇప్పుడు రకరకాలుగా మాట్లాడుతున్నాడని అన్నారు. తాము స్టేజీ ఎక్కితే ఎక్కడ వాస్తవాలు చెబుతామో అని ఆ అవకాశం ఇవ్వకుండా చేశారని, రామారావు, కథా రచయిత తమను మోసం చేశారని మండిపడ్డారు.

ఇదేనా కృతజ్ఞత..

రామారావు వ్యవహార శైలి వల్ల డి.మత్స్యలేశంలో చిచ్చు రేగింది. రామారావుకు అవకాశవాదం తప్ప కృతజ్ఞత లేదని మత్స్యకారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. 'పాకిస్తాన్ జైలు నుంచి విడుదలయ్యాక రామారావు ఏమన్నాడు.. ఇప్పుడేం మాట్లాడుతున్నారు...అంతా మీడియాలో రికార్డయి ఉంది.. మరిచిపోయి మాట్లాడితే పాత వీడియోలు గుర్తు చేస్తాయి...' అని అంటున్నారు. సినిమా యూనిట్‌ను తప్పుదారి పట్టించి, తమకు కనీసం గుర్తింపు లేకుండా చేశారని కూడా వాపోతున్నారు. ఆ గ్రామంలో ప్రస్తుతం రామారావు ఒక వైపైతే.. మిగతా వారంతా మరో వైపు ఉన్నారు. ఢీ అంటే ఢీ అన్నట్టుగా మాట్లాడుకుంటున్నారు. ప్రెస్‌మీట్ పెట్టి ఒకరిపై ఒకరు కౌంటర్లు వేసుకుంటున్నారు. ఈ క్రమంలో నాడు జరిగిన వాస్తవాలు బయటకు వస్తున్నాయి. ఎవరి గొప్పతనమేంటో, ఎవరి చేసిన మేలు ఏంటో చర్చకు వస్తోంది.

గంగమ్మ ఒడిలో..



పాతపట్నం: పాతపట్నంకు సమీపంలో మహేంద్రతనయ నదీ తీరంలో కొలువుదీరిన నీలకంఠేశ్వరుడు శివరాత్రి పూజలకు సిద్ధమయ్యాడు. ఆరు నెలల పాటు నీలకంఠేశ్వరుని శివలింగం రెండు అడుగుల నీటిలోనే ఉంటుంది. ఏటా జూన్ నుంచి డిసెంబర్ వరకు గర్భగుడిలో నీరు ఉంటుంది. ఈ ఆలయ ప్రాంగణంలోనే కాశీ విశ్వనాథుడు, రామేశ్వరుడు, మంజునాథుడు, కేదారేశ్వరుడు, సోమేశ్వర స్వామి ఆలయాలు ఉన్నాయి.

ఆలయాలే.. శంకరాభరణాలై..

గంగోదకాలు పవిత్ర లింగంపై ధారగా జాలువారే క్షణాలు రానే వచ్చాయి. విభూది రేఖలు భక్తుల నుదుటన చేరే ఘడియలు వచ్చేశాయి. చెట్టుపైన మారేడు దళాలు ప్రమథ గణాలుగా మారి శివుడి పాదాలను చేరే రోజు ఆసన్నమైంది. ఆలయాలు శంకరాభరణాలుగా మారే సమయమిది. మహాశివరాత్రికి శైవక్షేత్రాలు సిద్ధమయ్యాయి. అపురూప చరితను, అపూర్వ శిల్ప సంపదను తమలో ఇముడ్చుకున్న క్షేత్రాలు శివార్చనకు సంసిద్ధంగా ఉన్నాయి.



అరుణ కాంతిలో శశిధరుడు

సందె వేళ అరుణ కాంతిలో శశిధరుడు ఇలా మెరిసిపోయాడు. ఓ వైపు నాగావళి తీరంలోని ఉమారుద్ర కోటేశ్వరుడు శివరాత్రి పూజలకు సిద్ధమవుతుండగా.. ఆలయానికి సమీపంలో ఉన్న హరుని విగ్రహం ఇలా మంగళవారం సాయంత్రం వెలుగులీనింది. – సాక్షి ఫొటోగ్రాఫర్, శ్రీకాకుళం

మధుకేశ్వరుడి చెంత..



శ్రీముఖలింగేశ్వరుని ప్రధాన ఆలయం

జలుమూరు: ప్రఖ్యాత శ్రీముఖలింగం క్షేత్రం శివరాత్రికి ముస్తాబైంది. 26 నుంచి 28 వరకూ ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ఈఓ పి.ప్రభాకరరావు తెలిపారు. ప్రధాన ఆలయానికి తూర్పు దిక్కున ఉన్నది భీమేశ్వరాలయం కాగా దక్షిణ దిశలో ఉన్నది సోమేశ్వరాలయం. 26న శివరాత్రి, 27న పడియా, 28న స్వామి వారి చక్రతీర్థ స్నానాలు జరగనున్నాయి. శివరాత్రి ఉత్సవాల కోసం శ్రీకాకుళం నుంచి జలుమూరు వరకు ప్రతి అరగంటకు ఓ బస్సు సదుపాయం ఏర్పాటు చేశారు.


పంచధామ క్షేత్రం సిద్ధం



కోటబొమ్మాళి మండలం చిన్న హరిశ్చంద్రాపురం గ్రామంలో పంచధామ క్షేత్రంలో శివ లింగాలు

టెక్కలి: మహాశివరాత్రి ఉత్సవాలకు కోటబొమ్మాళి మండలం చిన్నహరిశ్చంద్రాపురం గ్రామంలో గల శ్రీ పంచధామ క్షేత్రం సిద్ధమైంది. ఇక్కడ 101 లింగాలను అఘోరాలు ప్రతిష్ఠించారు. సుమారు 6,900 శివ లింగాలతో ఉన్న ఈ ఆలయంలో శివరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఇక్కడ జల లింగం, వాయు లింగం, స్ఫటిక లింగా లతో పాటు జ్యోతిర్లింగాల నమూనాలు ఉన్నాయి.

త్రిమతాల సంగమం



ఆలయం బయట ఉన్న బుద్ధుని విగ్రహం

ఆమదాలవలస : ఆమదాలవలస పట్టణానికి మూడు కిలోమీటర్ల దూరంలోని సంగమేశ్వరుని ఆలయం త్రిమతాల సంగమంగా వెలుగొందింది. ఈ కొండ చరిత్ర 12వ శతాబ్దానిదని 1982లో సర్వే చేసిన పురవాస్తుశాఖ ప్రతినిధి జవహర్‌లాల్ పేర్కొన్నారు. జైన మతస్తుల తర్వాత బౌద్ధ మతస్తులు ఆ తర్వాత శైవ మతస్తులు ఈ కొండను ఆశ్రయించారని చరిత్రకారులు చెబుతుంటారు. కొండపైన 25 అడుగులలో ఆరు అడుగుల ఎత్తున్న పురుషాకృతి కలిగిన విగ్రహం, దానిముందు ఒక శివలింగం, నంది, దుర్గాదేవి, విఘ్నేశ్వర విగ్రహాలు ఉంటాయి.

అభిషేకాలకు సిద్ధం



కాలభైరవాలయం వద్ద నాగావళి తీరాన 11 అడుగుల శివలింగానికి పుష్పాభిషేకం(ఫైల్)

శ్రీకాకుళం కల్చరల్: నాగావళి తీరాన ఉన్న బాలా త్రిపుర కాలభైరవ పీఠం దేవాలయంలో శివరాత్రి సందర్భంగా 11 అడుగుల మృత్తికా శివలింగాన్ని ప్రత్యేకంగా ఏర్పాటు చేశారు. ఈ శివలింగానికి ఉదయం నుంచి సాయంత్రం వరకు ప్రత్యేక పూజలు జరుగుతాయి. నగరంలోని పుణ్యపువీధిలో గల సువర్చలా సమేత అభయాంజనేయ స్వామి ఆలయంలో ఆవరణలో 61 శివలింగాలను ఏర్పాటు చేసి సామూహికంగా దంపతులతో మహన్యాస పూర్వక రుద్రాభిషేకాలకోసం భారీగా ఏర్పాటు చేస్తున్నారు.

ప్రకృతిలో శివయ్య జాతర

కాశీబుగ్గ: మందస మండల పరిధిలోని మహేంద్ర గిరులు శివుడి స్మరణతో ప్రతిధ్వనిస్తాయి. బుధవారం శివరాత్రి ఉత్సవానికి తెలుగు రాష్ట్రాలతో పాటు ఒడిశా, ఛత్తీస్‌ఘడ్ నుంచి భక్తులు ఇక్కడికి తరలి వస్తారు. వ్యయ ప్రయాసల కోర్చి శివరాత్రికి ముందు రోజే గిరిపైకి చేరతారు. భజనలు, సంకీర్తనలతో రాత్రంతా జాగారం చేస్తారు. మర్నాడు భీముడి ఆలయం, కుంతీదేవి ఆలయం, ధర్మరాజు ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేసి తిరుగు ప్రయాణమవుతారు.



ధర్మరాజు ఆలయం

క్లుప్తంగా

కె.జె.పురం ఫీల్డ్ అసిస్టెంట్ సస్పెన్షన్

సారవకోట: మండలంలోని కె.జె.పురం ఫీల్డ్ అసిస్టెంట్ కుమారస్వామిని సస్పెండ్ చేసినట్లు ఎంపీడీఓ మోహన్‌కుమార్ మంగళవారం తెలిపారు. గత ఏడాది జరిగిన సామాజిక తనిఖీల్లో సుమారు రూ.5 లక్షలు రికవరీ గుర్తించడంతో పాటు ప్రతి వారం జరిగే సాధారణ సమావేశాలకు హాజరు కాకపోవడం, ఇటీవల కమిషన్ పెట్టిన సమావేశానికి సైతం హాజరు కాకపోవడంతో తాత్కాలికంగా విధుల నుంచి తప్పిస్తున్నట్లు ఆయన చెప్పారు.

డీఐజీని కలిసిన ఎస్పీ



డీఐజీ గోపినాథ్‌జెట్టికి మొక్క అందజేస్తున్న ఎస్పీ

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లాకు మంగళవారం విచ్చేసిన విశాఖపట్నం రేంజి డీఐజీ గోపినాథ్ జెట్టిని ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సాదరంగా ఆహ్వానించి పూలమొక్కను అందజేశారు.

శ్రీముఖలింగంలో చోరీ



తెరిచి ఉన్న బీరువా

జలుమూరు: శ్రీముఖలింగం కాళింగ వీధిలో కాంచనమాల పట్నాక్ ఇంట్లో చోరీ జరిగింది. దుండగులు చొరబడి సుమారు రూ.1.50 లక్షలు నగదు, ఎనిమిది తులాల బంగారం, ఎనిమిది కేజీల వెండి చోరీకి గురైంది. కాంచనమాల వారం కిందట శ్రీకాకుళంలోని తన కుమార్తె ఇంటికి వెళ్లి మంగళవారం సాయంత్రం శ్రీముఖలింగం చేరుకుంది. ఇంటికి వచ్చి చూసేసరికి ప్రధాన తలుపు బద్దలు కొట్టి ఉంది. లోపలికి వెళ్లి చూడగా బీరువా లాకర్ బద్దలు కొట్టి ఉంది. అందులో నగదు, వెండి సామగ్రి, బంగారం కనిపించకపోవడంతో జలుమూరు పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు ఆమె తెలిపింది.

వలస కూలీ అదృశ్యం



తంగి సుబ్బారావు (ఫైల్)

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల మండలం భగీరథపురం గ్రామానికి చెందిన తంగి సుబ్బారావు కొన్నాళ్లుగా రాజమండ్రిలో తాపీపని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. పని పూర్తయ్యాక రాత్రి 8 గంటల సమయంలో అందరూ మెస్‌కు చేరుకుంటారు. ఆదివారం సాయంత్రం కిరాణా షాప్‌కు వెళ్లి తిరిగి రాలేదు. వెతికినా ఆచూకీ కనిపించలేదు. అక్కడి పోలీస్‌స్టేషన్‌లో సైతం ఫిర్యాదు చేశారు. సుబ్బారావు ఆచూకీ కోసం గ్రామస్తులు, కుటుంబ సభ్యులు ప్రయత్నిస్తున్నారు.

ఎన్నికల కోడ్ ఉల్లంఘించిన ఎంఈఓ



కూటమి నాయకులతో కలిసి సమావేశంలో కూర్చున్న మెళియాపుట్టి ఎంఈఓ సవర దేవేంద్రరావు

సాక్షి టాస్క్‌ఫోర్స్: ఈ నెల 27న ఎమ్మెల్సీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో పాకలపాటి రఘువర్మను గెలిపించాలని కోరుతూ పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు మంగళవారం పాతపట్నంలోని తన కార్యాలయంలో ఐదు మండలాల కూటమి నాయకులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ప్రభుత్వ ఉద్యోగులు ఇటువంటి సమావేశాలకు హాజరుకాకూడదు. మెళియాపుట్టిలో మండల విద్యాశాఖ అధికారిగా పనిచేస్తున్న సవర దేవేంద్రరావు మాత్రం ఈ కార్యక్రమానికి హాజరై కోడ్ ఉల్లంఘించారు. ఈ ఘటనపై విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని వైఎస్సార్ సీపీ నాయకులు కోరుతున్నారు.

అరసవల్లి మిల్లు జంక్షన్‌లో రథచక్రం వద్ద ఎండిపోయిన మొక్కలు



మొక్కలంటే లెక్కలేదు!

- సుడా కార్యాలయం వద్ద ఎండిపోతున్న 30 వేల మొక్కలు
- సుందరీకరణ పేరిట రూ.30 లక్షలతో కొనుగోలు
- నిర్వహణ బాధ్యత తమది కాదని తప్పించుకుంటున్న సుడా, హార్టికల్చర్ అధికారులు



సుడా కార్యాలయం ఆవరణలో ఎండిపోయిన మొక్కలు



మిల్లు జంక్షన్ వద్ద సగానికి పైగా ఎండిపోయిన మొక్కలు

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): పచ్చదనం పరిశుభ్రత.. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలంటూ అధికారులు, ప్రజాప్రతినిధులు ఊకదంపుడు ఉపన్యాసాలు ఇస్తున్నారు తప్ప క్షేత్రస్థాయిలో అమలు చేయడం లేదు. ఇందుకు ప్రత్యక్ష ఉదాహరణగా శ్రీకాకుళం సుడా కార్యాలయం వద్ద ఉన్న వేలాది మొక్కలని చెప్పవచ్చు. రథసప్తమి సందర్భంగా సుందరీకరణ పనుల పేరిట జరిగిన పనుల్లో లక్షలాది రూపాయల ప్రజాధనం దుర్వినియోగం జరిగింది. హడావిడి పనులు.. అవసరం లేని హంగామా..శాశ్వత ప్రాతిపదికన చేయాల్సిన పనులకు పైపైన మెరుగులు దిద్ది మమ అనిపించేశారనే విమర్శలు వెల్లువెత్తాయి. దీనిలో భాగంగా అరసవల్లి దేవాలయం పరిసరాలను సుందరంగా తయారుచేసేందుకు సుడా నిధులతో సుమారు 30 వేలు మొక్కలు అప్పట్లో కొనుగోలు చేశారు. ఒక్కో మొక్క విలువ రూ.100 చొప్పున పూణేలో కొని తీసుకొచ్చారు. వీటి మొత్తం విలువ అక్షరాలా రూ.30లక్షలు. ఇందులో 10వేలు మొక్కలను మిల్లు జంక్షన్ కూడలిలో.. మరికొన్ని రోడ్డు మధ్యలో ఉన్నాయి. మిగిలిన 20వేలు మొక్కలు ఇంకా సుడా కార్యాలయ ఆవరణలోనే దర్శనమిస్తున్నాయి. వాటికి నీరు పోసే వారు లేక అవన్నీ ప్రస్తుతం ఎండిపోతున్నాయి. ఈ మొక్కలు ఏం చేస్తారని సుడా అధికారుల్ని పలువురు అడుగుతుంటే వాటిని అమ్ముతాం గానీ కొనేవారు ఎవరూ లేరని ఆ శాఖ అధికారులే చెప్పడం గమనార్హం. మొక్కల్ని సంరక్షించాలి.. ప్రజాధనం వృథా చేయకుండా ఉండాలి అనే ఆలోచనలు ఉంటే రథసప్తమి వేడుక పూర్తయిన వెంటనే జిల్లాలో పలు ప్రాంతాల్లో ఉన్న నర్సరీలకు గానీ, ఉద్యానశాఖ అధికారులను గానీ సంప్రదించి మొక్కలు బతికుండగానే అమ్మేసి ఆ సొమ్మును సుడా శాఖకు ఆదా చేయాలి. అయినా ఇవేవీ తమకు సంబంధించినది కాదన్నట్లు సుడా అధికారులు వ్యవహరించడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

నిర్వహణకో 'నమస్కారం'

అరసవల్లి మిల్లు జంక్షన్‌లో ఏర్పాటు చేసిన మొక్కలదీ ఇదే పరిస్థితి. సూర్య నమస్కారాల మధ్యలో వేసిన గడ్డి, మిల్లు జంక్షన్‌లో హోర్డింగ్ మోడల్ మొక్కలు సైతం ఎండిపోతున్నారు. వీటి నిర్వహణ బాధ్యత తమది కాదంటూ ఇటు కార్పొరేషన్, సుడా అధికారులు.. అంటు హార్టీకల్చర్ సిబ్బంది పక్కకు తప్పుకుంటున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి మిగిలిన కొన్ని మొక్కలనైనా బతికించాలని పర్యావరణ ప్రేమికులు కోరుతున్నారు. మొక్కల సంరక్షణ విషయమై సుడా కార్యాలయం పీఓ అమర్‌నాథ్ వద్ద ప్రస్తావించగా స్పందించలేదు.

చంద్రబాబు పాలనపై 'కూన'కు ఫోన్



ఫోన్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కూన రవికుమార్

ఆమదాలవలస: ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్‌కు మంగళవారం ఓ వింత అనుభవం ఎదురైంది. ఆయన పార్టీ క్యాడర్‌తో మాట్లాడుతుండగా.. ఓ ఫోన్‌కాల్ వచ్చింది. లిఫ్ట్ చేసి చూస్తే అవతలి వారు 'ఏపీలో చంద్రబాబు పాలన ఎలా ఉంది.. ఆమదాలవలస ఎమ్మెల్యే పాలన ఎలా ఉంది..?' అని ప్రశ్నలు అడిగారు. దీంతో ఆయన అందరి ముందు స్పీకర్‌లో మాట్లాడారు. 'ఆమదాలవలస ఎమ్మెల్యే మంచివారేనా' అని అడిగిన ప్రశ్నకు ఆయన మంచివారు కాదని సమాధానం చెప్పారు. 'మీకు పెళ్లయ్యిందా..? వయసు ఎంత..?' అని అడిగిన ప్రశ్నలకు సరదాగా సమాధానాలు చెప్పి ఆటపట్టించారు. ఈ తంతును అక్కడున్న వారు వీడియో తీసి సోషల్ మీడియాలో పోస్టు చేశారు. టీడీపీ పాలన ఎలా ఉంది అని ఎమ్మెల్యేనే ప్రశ్నించడం అందరికీ విచిత్రంగా అనిపించింది.

బొడ్డేపల్లిలో ఇసుక తవ్వకాలపై ఆరా



ర్యాంపును పరిశీలిస్తున్న తహశీల్దార్, ఎస్‌ఐ

పొందూరు: మండలంలోని బొడ్డేపల్లిలో జరుగుతున్న ఇసుక అక్రమ ర్యాంపును తహశీల్దార్ వెంకటేష్ రామానుజులు, ఎస్‌ఐ వి.సత్యనారాయణ మంగళవారం పరిశీలించారు. వైఎస్సార్‌సీపీ ఆమదాలవలస నియోజకవర్గ ఇన్‌చార్జి చింతాడ రవికుమార్ రెండు రోజుల క్రితం బొడ్డేపల్లి, నెల్లిమెట్ట ర్యాంపులను పరిశీలించడానికి వెళ్లిన సందర్భంలో టీడీపీ సామాజికవర్గ నాయకులు అడ్డుకున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో అధికారులు పరిశీలన చేశారు. ర్యాంపులో ఆరు ట్రాక్టర్లు, ఐదుగురు కూలీలు ఉన్నారని, ఇకపై రోజూ పరిశీలనలు చేస్తామని తెలిపారు. ఇక్కడ లోతుగా తవ్వకాలు జరిగినట్లు గుర్తించామన్నారు. పూసపాటిరేగ, లావేరు నుంచి వచ్చి ట్రాక్టర్లతో ఇసుకను తీసుకెళ్తున్నట్లు గుర్తించామని, ర్యాంపులో యంత్రాలు లేవని స్పష్టం చేశారు.

అవినీతి అధికారులపై చర్యలకు ఆదేశాలు

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లాలోని పురుషోత్తపురం ఇంటిగ్రేటెడ్ చెక్‌పోస్టులో 2014లో ఏడుగురు రెవెన్యూ (కమర్షియల్ టాక్స్) విభాగం అధికారులు అవినీతికి పాల్పడుతుండగా ఆకస్మిక తనిఖీలో భాగంగా అప్పటి విజయనగరం రేంజ్ ఏసీబీ డీఎస్పీ పట్టుకున్నారు. దానికి సంబంధించి అప్పటి ఏసీబీ డీజీ కమిషనరేట్ ఆఫ్ ఎంక్వైరీకి నివేదికను సమర్పించారు. అప్పట్లో పట్టుబడిన వారిలో ముగ్గురు ఉద్యోగ విరమణ పొందడం, మరో ఇద్దరు మరణించడంతో వారిని కేసు నుంచి డ్రాప్ చేసింది. మిగతా ఇద్దరిపై తదుపరి చర్యలు తీసుకోవాల్సిందిగా కమిషనరేట్ ఆఫ్ ఎంక్వైరీ (సీవోఐ) ప్రస్తుత అధికారైన రమేష్‌కుమార్ సుమన్ (ఐఎఫ్ అండ్ మెంబర్ -సీవోఐ)కు కేసు అప్పగించింది. ఈ మేరకు మంగళవారం ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ నుంచి ప్రకటన విడుదలైంది. చనిపోయిన వారిలో పి.ఆనందరావు (డీసీటీవో), వి.అప్పలనాయుడు (డీసీటీవో)లు ఉండగా, ఉద్యోగ విరమణ పొందినవారిలో డి.బెహరా (ఏసీటీవో), ఎ.శ్రీరాములు (ఏసీటీవో), డి.వెంకటరావు (జూనియర్ అసిస్టెంట్) ఉన్నారు. ప్రస్తుతం కె.శ్రీనివాసరావు (జూనియర్ అసిస్టెంట్), వై.అప్పలరాజు (జూనియర్ అసిస్టెంట్) విధుల్లో ఉండటంతో వారిపై తదుపరి చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.

మద్యం బాటిళ్లు పట్టివేత

శ్రీకాకుళం క్రైమ్ : అరసవల్లి మిల్లు కూడలి వద గార మండలం ఉప్పరపేటకు చెందిన వ్యక్తి వద్ద 12 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ ఎం.హరికృష్ణ తెలిపారు. నిందితుడిపై కేసు నమోదు చేశామని చెప్పారు.

రైలు ఢీకొని వృద్ధుడి మృతి

టెక్కలి రూరల్: స్థానిక తెంబూరు రోడ్డులోని రైల్వే గేటు సమీపంలో మంగళవారం రైలు ఢీకొని రాధావల్లభపురం గ్రామానికి చెందిన బగాది అప్పలనాయుడు(65) అనే వృద్ధుడు మృతిచెందాడు.వ్యక్తిగత పనుల నిమిత్తం టెక్కలి వచ్చిన అప్పలనాయుడు అయ్యప్పనగర్ వైపు వెళ్లేందుకు రైల్వే ట్రాక్ దాటుతుండగా నౌపడ నుంచి గుణుపూర్ వైపు వెళ్తున్న రాజారాణి ఎక్స్‌ప్రెస్ ఢీకొట్టడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ప్రమాదం జరిగిన అనంతరం రైలును సుమారు 20 నిమిషాల పాటు నిలిపివేయడంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. విషయం తెలుసుకున్న పలాస రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పలాస ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అప్పలనాయుడుకు నలుగురు కుమార్తెలు. అందరికీ పెళ్లిళ్లు చేసి తన భార్య మాణిక్యంతో కలిసి గ్రామంలో వ్యవసాయం చేసుకుని జీవనం సాగిస్తున్నాడు. ఇంతలో దుర్ఘటన జరగడంతో గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి.

చికిత్స పొందుతూ యువకుడు మృతి



అభిరామ్(ఫైల్)

టెక్కలి రూరల్: మండలంలోని లచ్చన్నపేట సమీపంలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలపాలైన బెండి అభిరామ్(18) అనే యువకుడు మంగళవారం శ్రీకాకుళం రిమ్స్‌లో చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడిది టెక్కలి మండలం జయకృష్ణపురం గ్రామం. గోపినాథపురం సమీపంలోని ఓ ప్రైవేట్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. ఫేర్‌వెల్ డే సందర్భంగా స్నేహితుడిని తీసుకొచ్చేందుకు నందిగాం మండలం తామరాపల్లి వెళ్లి తిరిగి వస్తుండగా బైక్ అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. తీవ్ర గాయాలపాలైన అభిరామ్‌ని టెక్కలి జిల్లా ఆస్పత్రికి, అక్కడి నుంచి శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. పరిస్థితి విషమించడంతో మంగళవారం మృతిచెందారు. టెక్కలి పోలీసులు కేసు నమోదు చేశారు. అనంతరం మృతదేహాన్ని అతని స్నేహితులు జగతిమెట్ట జంక్షన్ నుంచి మృతుడి స్వగ్రామమైన జయకృష్ణాపురం వరకు ర్యాలీగా తీసుకువెళ్లారు. కాగా, ఒక్కగానొక్క కుమారుడు మృతిచెందడంతో తల్లిదండ్రులు బెండి వనజాక్షి, గణేష్ శోకసంద్రంలో మునిగిపోయారు.

కాంట్రాక్ట్ ఉద్యోగి ఆత్మహత్య



వలిశెట్టి తులసి(ఫైల్)

సోంపేట: మండలంలోని బారువ మేజర్ పంచాయతీ బారువ కొత్తూరు గ్రామానికి చెందిన వలిశెట్టి తులసి (24) ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. తులసి మండలంలోని బట్టిగళ్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఎం.ఎల్.హెచ్.ఓగా కాంట్రాక్ట్ పద్ధతిలో విధులు నిర్వహిస్తోంది. మంగళవారం ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. అదే ఆరోగ్య కేంద్రంలో ఫార్మసిస్ట్‌గా విధులు నిర్వహిస్తున్న ఎం.ప్రదీప్ తమ కుమార్తెను వేధించడం వల్లే మనస్తాపం చెంది ఆత్మహత్య చేసుకుందని తండ్రి హేమారావు బారువ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. తులసి తల్లి బోగమ్మ, సోదరి కుంభమేళాకు వెళ్లారు. తండ్రి ఫిర్యాదు మేరకు బారువ ఎస్‌ఐ హరిబాబునాయుడు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జిల్లా సరిహద్దులో డ్రోన్ నిఘా



ఇచ్ఛాపురంలో బహిరంగంగా మద్యం సేవిస్తూ డ్రోన్ కెమెరాకు చిక్కిన యువత

శ్రీకాకుళం క్రైమ్/ఇచ్ఛాపురం : ఒడిశా సరిహద్దులోని ఇచ్ఛాపురం టౌన్ పరిధిలో అసాంఘిక కార్యకలాపాల అడ్డుకట్టలో భాగంగా డ్రోన్ కెమెరాతో మరింత నిఘా పెంచుతున్నామని ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డి అన్నారు. గంజాయి అక్రమ రవాణా, క్రయ విక్రయాలు జరగకుండా నిలువరిస్తామని చెప్పారు. మంగళవారం ఇచ్ఛాపురం పట్టణ పరిధిలోని ఈదుపురం, పురుషోత్తపురం, బహుదా నదీ పరివాహక ప్రాంతాలతో పాటు జిల్లాకేంద్రంలోని శాంతినగర్, భైరివానిపేట, బలగ, నాగావళి నదీ పరీవాహక, నిర్మానుష్య ప్రాంతాల్లో డ్రోన్ కెమెరాతో పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ బహిరంగంగా మద్యం సేవించడం, గంజాయి తాగడం, విద్యార్థినులను వేధించడం, పేకాట, జూదం ఇతర కార్యకలాపాలను అరికట్టడంలో భాగంగానే డ్రోన్ నిఘా పెడుతున్నామన్నారు.

● తల్లిదండ్రులకు పాదపూజ



చిన్నకిట్టాలపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం 10వ తరగతి విద్యార్థులు వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు పాదపూజ నిర్వహించారు. పాతపట్నం గ్రామానికి చెందిన రామరాజు చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు పారశెల్లి రామరాజు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో విద్యార్థులకు పరీక్షల మెటీరియల్ అందజేశారు. కార్యక్రమంలో ఎంఈఓ ఎం.వి.రమణ, హెచ్ఎం రమేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. - సారవకోట

ఎస్ఎంపురం ఆలయంలో చోరీ

ఎచ్చెర్ల క్యాంపస్: మండలంలోని ఎస్ఎంపురం రామాలయంలో సోమవారం అర్ధరాత్రి దుండగులు చొరబడి రెండు కిలోల వెండి ఆభరణాలు చోరీ చేశారు. మంగళవారం ఉదయం పురోహితులు గుడి తలుపులు తీసేందుకు వెళ్లగా తలుపు తాళాలు విరగ్గొట్టి ఉన్నాయి. అనంతరం ఆలయ సేవా కమిటీ ప్రతినిధి చౌదరి అవినాష్ ఎచ్చెర్ల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్సై వి.సందీప్‌కుమార్, సిబ్బంది ఆలయాన్ని పరిశీలించారు. క్లూస్ టీం వచ్చి వివరాలు సేకరించారు. రెండు కిలోల వెండి చోరీకి గురైనట్లు గుర్తించి పోలీసులు కేసు నమోదు చేశారు.

గంజాయి రవాణా గుట్టురట్టు

- పలాస, వజ్రపుకొత్తూరు, ఇచ్ఛాపురం, సోంపేటలలో పట్టుబడిన నిందితులు
- వివరాలు వెల్లడించిన కాశీబుగ్గ డీఎస్పీ వెంకట అప్పారావు



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ వి.వెంకట అప్పారావు

ఇచ్ఛాపురం: ఒడిశా నుంచి మహారాష్ట్రకు గంజాయిని అక్రమ రవాణ చేసేందుకు ప్రయత్నించిన ఇద్దరు నిందితులను అరెస్టు చేసినట్లు కాశీబుగ్గ డీఎస్పీ వి.వెంకట అప్పారావు తెలిపారు. ఇచ్ఛాపురం సీఐ కార్యాలయంలో మంగళవారం డీఎస్పీ విలేకరులకు వివరాలు వెల్లడించారు. మహారాష్ట్రలోని జల్నా జిల్లాకి చెందిన రవిరామదోత్రే, పర్భాని జిల్లా జింతూరు గ్రామానికి చెందిన విశ్వనాథ్ తుకారామ్‌లు బరంపురం కొత్తబస్టాండ్ వద్ద ఆలోక్‌పరిచ్ఛా నుంచి 10.020 కేజీల గంజాయిని తీసుకొని మంగళవారం ఇచ్ఛాపురం చేరుకున్నారు. రైల్వేస్టేషన్‌కు వెళ్తుండగా రత్తకన్న రోడ్డు ఎల్‌సీ గేట్ వద్ద పోలీసులకు పట్టుబడ్డారు. నిందితుల వద్ద నుంచి గంజాయి, రెండు సెల్‌ఫోన్ల స్వాధీనం చేసుకొని అరెస్టు చేశారు. సీఐ మీసాల చిన్నంనాయుడు, రూరల్ ఎస్సై శ్రీనివాసరావు, క్రైం సిబ్బంది పాల్గొన్నారు.

సోంపేట: ఒడిశా నుంచి ముంబైకు గంజాయి అక్రమంగా తరలిస్తున్న వ్యక్తితో పాటు మరో ముగ్గురిని బారువ పోలీసులు అరెస్టు చేసినట్లు కాశిబుగ్గ డీఎస్పీ వెంకట అప్పారావు తెలిపారు. మంగళవారం సోంపేట సీఐ కార్యాలయంలో విలేకరులకు వివరాలు వెల్లడించారు. ఒడిశా రాష్ట్రానికి చెందిన ప్రధాన రాజేష్ సంతోష్‌బాయ్ కుదల గ్రామానికి చెందిన సుబ్రహ్మణ్యం వద్ద నుంచి 6.210 కిలోలు గంజాయిని కొనుగోలు చేశాడు. ముంబైలో ఉంటున్న పింటుబాయ్‌కు ఇచ్చేందుకు సోంపేటకు బస్సులో వచ్చాడు. అక్కడి నుంచి విశాఖ వెళ్లేందుకు బస్సు కోసం వేచి ఉండగా సోంపేట ఎస్‌ఐ లవరాజుకు వచ్చిన సమాచారం మేరకు రాజేష్‌ను పట్టుకుని అరెస్టు చేశారు. గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. అదే విధంగా, గుంటూరు జిల్లా మంగళగిరి మండలం నువులూరుకు చెందిన ఎం.దినకర్, దుగ్గిరాల మండల అవిని గ్రామానికి చెందిన సవలం అన్వేష్, సోంపేట మండలం బారువ కొత్తూరు గ్రామానికి చెందిన కసరాపు దిలీప్ స్నేహితులు. గంజాయికి బానిసయ్యారు. ముగ్గురూ కలిసి ఒడిశా రాష్ట్రం సుమండి గ్రామానికి వెళ్లి కేజీ 900 గ్రాముల గంజాయి కొనుగోలు చేశారు. బైక్‌పై తిరిగి వస్తుండగా మంగళవారం ఉదయం 8 గంటల సమయంలో బారువ ఎస్‌ఐ హరిబాబునాయుడు, సిబ్బంది పట్టుకున్నారు. ముగ్గురినీ అరెస్టు చేసి గంజాయి స్వాధీనం చేసుకున్నారు. సమావేశంలో సీఐ బి.మంగరాజు, సోంపేట, బారువ ఎస్‌ఐలు లవరాజు, హరిబాబునాయుడు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

వజ్రపుకొత్తూరు: రెండు వేర్వేరు ఘటనల్లో 18 కిలోల 280 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకుని ఆరుగురిని అరెస్టు చేసినట్లు కాశీబుగ్గ డీఎస్పీ వి.వెంకట అప్పారావు తెలిపారు. మంగళవారం కాశీబుగ్గ పోలీస్ స్టేషన్‌లో రూరల్ సీఐ డి.తిరుపతి, ఎస్‌ఐ బి.నిహార్‌లతో కలిసి విలేకరులకు వివరాలు వెల్లడించారు. సోమవారం మధ్యాహ్నం బెండిగేటు జంక్షన్‌కు ఒడిశా రాష్ట్రం గంజాంకు చెందిన మనయ్ సబర్, ప్రశాంత్ మల్లిక్, వజ్రపుకొత్తూరు మండలం నువ్వలరేవుకు చెందిన బైనపల్లి షణ్ముఖ గంజాయితో వచ్చారు. అనుమానాస్పదంగా తిరగడంతో తనిఖీ చేయగా వారి వద్ద నుంచి 8.280 కిలోల గంజాయి, మొబైల్ ఫోన్, ద్విచక్ర వాహనం స్వాధీనం చేసుకున్నారు. అదే రోజు పూండి రైల్వే స్టేషన్‌లో 10 కిలోల గంజాయిని రవాణా చేస్తున్న ఒడిశా రాష్ట్రం గంజాంకు చెందిన ప్రశాంత్ కుమార్, భారతీ షాహు, ముంబైకు చెందిన నవాబ్ అహ్మద్‌ను అదుపులోకి తీసుకున్నారు. వీరి వద్ద నుంచి 10 కిలోల గంజాయి, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. నిందితులను మంగళవారం నరసన్నపేట కోర్టులో హాజరుపరిచినట్లు డీఎస్పీ తెలిపారు.

నిరుద్యోగ యువతే టార్గెట్..

ఒడిశా ప్రాంతంలో ఇబ్బడి ముబ్బడిగా పెరుగుతున్న గంజాయిని తక్కువ ధరకు కొనుగోలు చేసి స్థానిక నిరుద్యోగ యువత ద్వారా మహారాష్ట్ర, కర్ణాటక, కేరళ తదితర ప్రాంతాలకు తరలిస్తున్నారని డీఎస్పీ తెలిపారు.గంజాయి మాఫియా నిరుద్యోగ యువతను టార్గెట్‌గా చేసుకుని అమాయకులను ఉచ్చులో దింపి ఆయా ప్రాంతాలకు రవాణా చేసి కిలో రూ.20వేలకు పైగా విక్రయాలు చేస్తున్నారని చెప్పారురు. తాత్కాలిక ఆనందాలు, మత్తు పదార్థాలకు యువత బలికావద్దని హితవుపలికారు. ఇలాంటి పనులు చేసే ముందుగా తమ కుటుంబాలను యువత గుర్తు చేసుకోవాలన్నారు. గంజాయితో పట్టుబడితే తీవ్రమైన కేసులతో పాటు ఆస్తులను సైతం సీజ్ చేస్తామని హెచ్చరించారు. గంజాయి రవాణా సమాచారం తెలిస్తే పోలీసులకు సమాచారం అందించి మెరుగైన సమాజం కోసం కృషి చేయాలని ప్రజలను కోరారు.

40 కేజీల గంజాయితో ఇద్దరు అరెస్టు



కాశీబుగ్గ: గంజాయిని స్వాధీనం చేస్తున్న పోలీసులు

కాశీబుగ్గ: ఒడిశా నుంచి చెన్నై, బెంగళూరు పట్టణాలకు గంజాయి తరలిస్తున్న ఇద్దరిని కాశీబుగ్గ పోలీసులు పట్టుకున్నట్లు కాశీబుగ్గ డీఎస్పీ వెంకటఅప్పారావు, సీఐ సూర్యనారాయణ తెలిపారు. మంగళవారం కాశీబుగ్గ పోలీస్‌స్టేషన్‌లో వివరాలు వెల్లడించారు. ఒడిషా రాష్ట్రం రాయగడ జిల్లా మోహన గ్రామానికి చెందిన బబుల్లు ఉదయగిరిలో గంజాయి సాగు చేస్తున్నారు. ఆయనకు వచ్చిన 40 కేజీల గంజాయి ఆర్డర్‌ను తరలించడానికి మధ్యవర్తులు నరేంద్ర లిమా, లితు రైట్‌లు రూ.20వేలకు ఒప్పుకున్నారు. వీరు పలాస రైల్వేస్టేషన్‌కు రెండు ద్విచక్ర వాహనాలతో రాగా పోలీసులకు పట్టుబడ్డారు. గంజాయిని స్వాధీనం చేసుకుని వాహనాలు, రెండు సెల్‌ఫోన్లను సీజ్ చేశారు. నిందితులను అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు.